క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



హఫీజ్‌పేట్ : చందానగర్, పాపిరెడ్డి సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్టీసీ కాలనీ (మైత్రీనగర్) ఫీడర్ పరిధిలో ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్కెట్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు రెండు వైపుల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శేరిలింగంపల్లి: 11 కేవీ నల్లగండ్ల ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ తెలిపారు. ఫీడర్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియా, రత్న దీప్ సూపర్ మార్కెట్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

- 11 కేవీ ఎఫిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు నల్లగండ్ల హుడా కాలనీ, సాధనా స్కూల్ బ్యాక్ సైడ్ ఏరియా, ఎఫిస్టిమో గ్లోబల్ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాయదుర్గం: గచ్చిబౌలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను సోమవారం నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయిఐశ్వర్యకాలనీ, జైన్ హౌసింగ్, ఖాజాగూడ ప్రాంతం, హెచ్ఎండీఏ భవనాలు, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్ వంటి ప్రాంతాలలో విద్యుత సరఫరాను నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

- జేవీకాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జేవీకాలనీ, కేంద్రీయ విహార్‌కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నా మని విద్యుత్ వినియోగదారులు సహకరించా లన్నారు.

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను సోమవారం నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీసీఎల్ లేఅవుట్, మసీదుబండ ప్రధాన రోడ్డు, ఎస్‌మార్ట్ నుంచి మై హోమ్ మంగళ రోడ్డు పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో.....

- శ్రీరామ్‌నగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెసెల్లా విల్లాస్,శ్రీరామ్‌నగర్‌కాలనీ సీ బ్లాక్, వుడ్స్ విల్లాస్, అపర్ణా హైట్స్ ప్రాంతాలతోపాటు పరిసరాలు, శ్రీరామ్‌నగర్ ప్రధాన రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'మనూ'లో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ కోర్సులలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిప్లొమో, అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు ఫారమ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీని ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించామన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలాన్నరు.

రేపు 'మనూ'లో నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోఈనెల 22వ తేదీన 'మనూ' 5వ నాలెడ్జ్ సిరీస్ ఎన్‌రిచ్‌మెంట్ లెక్చర్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ ఆహ్మద్ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో ఈ లెక్చర్‌ను నిర్వహిస్తామన్నారు. ఎస్ఎఫ్‌డీసీ ఫిల్మ్ ఫెసిలిటేషన్ మాజీ హెడ్ విక్రమ్‌జిత్‌రాయ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. 'జీ–20 దేశాల మధ్య చలనచిత్ర సహ–నిర్మాణ సాధ్యాసాధ్యాలు' అనే అంశంపై ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో జరిగే ఈ కార్యక్రమం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంసీ కన్వీనర్, నిర్మాత ఎండీ అమీర్ బదర్ కూడా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

శ్రావణ మాస బోనాల సందడి

రాయదుర్గం: శ్రావణమాస బోనాల సందడి గచ్చిబౌలి డివిజన్‌లో పలు చోట్ల కనిపించింది. ఇందిరానగర్‌లోని మైసమ్మ,పోచమ్మ, పెద్దమ్మదేవాలయాల్లో, గౌలిదొడ్డిలోని పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయం, కేశవనగర్‌లోని ఎల్లమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయాల్లో బోనాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాలను రాత్రి నుంచే మామిడి ఆకులు, విద్యుత్‌దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ సందడి చేశారు. ప్రతి ఆలయంలో అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి రావడంతో ఆలయ ప్రాంగణాలలో సందడి వాతావరణం నెలకొంది.



ప్రత్యేక శ్రావణ పూజలందుకున్న అమ్మవారు



గచ్చిబౌలిలో శ్రావణబోనాలను అమ్మవారికి సమర్పించేందుకు వస్తున్న మహిళలు

పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి డివిజన్‌లోని ఇందిరానగర్, గౌలిదొడ్డి, కేశవనగర్‌లోని అమ్మవారి ఆలయాల్లో బోనాల సందర్భంగా అమ్మవారి పూజల్లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్న అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ప్రతినిధులుఘనంగా సత్కరించారు. పూజారులు ఆయనకు ప్రత్యేక ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు, అమ్మవారి దీవెనలు పొందేందుకు ప్రతి ఇంటి బిడ్డ బోనమెత్తి హిందూ సంస్కృతికి నిజమైన వారసురాలుగా నిలుస్తారన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో గచ్చిబౌలి డివిజన్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్, గౌలిదొడ్డి, కేశవనగర్ వాసులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం వద్ద బోనాల వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఎన్నో ఏళ్ళ తర్వాత పూర్వ విద్యార్థులు గచ్చిబౌలిలోని 'ఎస్కీ'కి రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సంతోషంతో ఒకరినొకరు పలకిరించుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు. తమకు చదువుచెప్పిన అధ్యాపకులు, ఎస్కీ అధికారులు, డైరెక్టర్ రామేశ్వర రావును ప్రిన్సిపల్ డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి పలకరించారు. సమావేశాన్ని జ్యోతి వెలిగించి డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'ఎస్కీ'లోని ప్రస్తుత విద్యార్థుల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా సహకరించాలన్నారు. పూర్వ విద్యార్థులు అందరి హృదయాలకు దగ్గరగా ఉంటారన్నారు. వారి అభివృద్ధి మన అభివృద్ధి తప్ప మరొకటి కాదన్నారు. ఎస్‌పీజీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కెరీర్ వృద్ధికి నెట్‌వర్కింగ్ చాలా ముఖ్యమన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు, ఖైరతాబాద్ అశ్విన్ ఆస్పత్రుల డైరెక్టర్ జి సీతాదేవి మాట్లాడుతూ భవిష్యత్తు కార్యకలాపాలకు పూర్తి సహకారం అందిస్తామని, ప్రస్తుత విద్యార్థులకు అన్ని రకాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పూర్వవిద్యార్థులుప్రియతం, ఎం శ్రావణి తమ పాతజ్ఞాపకాలను, పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు, పనితీరుపై ప్రసంగించారు.



కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర రావు, ప్రిన్సిపల్ జగన్‌మోహన్‌రెడ్డి



పూర్వవిద్యార్థులు..

'మనూ' విద్యార్థికి పీహెచ్‌డీ



ఎండీ సాదత్‌హుస్సేన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి ఎండీ సాదత్‌హుస్సేన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. దర్భంగా సీటీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాఫర్ ఇక్బాల్‌జైదీ పర్యవేక్షణలో ఆయన 'టెక్నలాజికల్ పెడగోగికల్ కంటెంట్ నాలెడ్జ్ అండ్ సెల్ఫ్ ఎఫిషియసీ ఆఫ సెకండరీ స్కూల్ సోషల్ స్టడీస్ టీచర్స్–ఏ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేశారు. దీన్ని పరిశీలించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. ఎస్ఐ జగదీశ్ తెలిపిన మేరకు.. ఐడీ బొల్లారానికి చెందిన సుమీల (50) ఆదివారం ఉదయం మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌కు ప్రార్థన నిమిత్తం వచ్చింది. ఈ క్రమంలో మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద బస్సు దిగింది. అక్కడి నుండి కల్వరి టెంపుల్ వైపు రోడ్డు దాటుతుండగా కేపీహెచ్‌బీ నుండి మియాపూర్ వైపు వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు ఢీకొట్టింది. దీంతో సుమీల కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు దగ్గరలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కుమారుడు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సుమీల కుమారుడు జోగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పరిధిలోని పాపారాయుడు నగర్ కాలనీలో నాయన్స్ అపార్టుమెంట్ వారు సుమారు 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్ పాల్గొని కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎటువంటి నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రతి బస్తీ, కాలనీలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలు జరిగినప్పుడు నేరస్తులను పట్టుకునే సందర్భంలో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌రావు, శ్రీనివాస, భాస్కర్‌రెడ్డి, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్, ఇన్‌స్పెక్టర్

భార్య ఫోన్ లిఫ్ట్ చేయలేదని..

- ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నీలి ప్రసాద్(ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పుట్టింటికి వెళ్లిన భార్య ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్లికార్జున నగర్‌కు చెందిన నీలి ప్రసాద్ (26) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ప్రసాద్‌కు ఎనిమిది నెలల క్రితం హైదరాబాద్ నగరంలోని కాటేదాన్ ప్రాంతానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. వారం రోజుల క్రితం మౌనిక పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి ప్రసాద్ మౌనికకు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయకుండా కట్ చేసింది. దీంతో ప్రసాద్ భోజనం చేయకుండా గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. ఆదివారం ఉదయం గదిలో నుంచి ప్రసాద్ బయటకు రాకపోవడంతో అతని తండ్రి పెంటయ్య తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీనగర్ అభివృద్ధికి కృషి చేయాలి

మణికొండ: శివాజీనగర్ కాలనీ అభివృద్ధికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ పూర్తి స్థాయిలో కృషి చేయాలని మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ అన్నారు. ఆదివారం సంఘం నూతన కార్యవర్గ కమిటీని ఆయన ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కె.రమేష్, ఉపాధ్యక్షులుగా కె.రాజు, బి.నర్సింగరావు, కె.సంతోష్, కె.జయరాం, చైర్మన్‌గా కె.దేవేందర్, వైస్ చైర్మన్‌గా వై.కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి. మహేందర్, సంయుక్త కార్యదర్శిగా పి. ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు కోశాధికారిగా డి. మహేష్, సంయుక్త కోశాధికారిగా జె.వినేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వై.భాస్కర్, డి.రాజు, కమిటీ కార్యవర్గ సభ్యులుగా వై. శ్రీనివాస్, వై. ప్రవీణ్, కె.గోపాల్, వై.ధను, సలహాదారులుగా వై.నరేష్, టి.గోవింద్, కె.నర్సింగ్‌రావు, వై. రఘుపతి, వై.రాజు, కె.నర్సింహ, వై. మహేందర్‌ను ఎన్నుకున్నారు.

సేవియర్స్ లుథెరన్ చర్చిలో 'మహిళా ఆదివారం'

మణికొండ: సేవియర్స్ లుథెరన్ చర్చిలో ఆదివారం మహిళల వారంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇవీలైన్ గ్రేస్ మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళ అని, ఆమెను ప్రతి ఒక్కరూ గౌరవంగా చూసుకున్నపుడే ఆరోగ్యకర సమాజం నిర్మితం అవుతుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డిని సత్కరించారు. మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి పార్టీ విస్తరణకు రూపారెడ్డి తనవంతు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మాధురి నటరాజ్, కార్యదర్శి ఈవెలిన్ గ్రేస్, కోశాధికారి ఝాన్సీ ఉదయ్, సభ్యులు అనూష డేవిడ్, మెర్సీరాజ్ పాల్గొన్నారు.

లేక్‌వ్యూ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని లేక్‌వ్యూ కాలనీలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం కాలనీవాసులతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానని అన్నారు. కాలనీవాసులందరూ కాలనీ అభివృద్ధిలో భాగస్వాములై సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సురేష్, వెంకటేశ్వర్‌రావు, శరత్, యుగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో వర్షం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. పలు చోట్ల కురిసిన వర్షానికి రోడ్లపైకి వరదనీరు పారింది. వాహనదారులు, పాదచారులు కాస్త ఇబ్బంది పడ్డారు. కానీ ఆతర్వాత వర్షం తగ్గిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా పలువురు వాహనదారులు లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద వరదనీరు వచ్చి చేరుతుందేమోనని భయపడినా అంతగా వరదనీరు రాకపోవడంతో ఊపిరిపీల్చుకొని అండర్‌బ్రిడ్జి కింద నుంచే వాహనదారులు రాకపోకలు సాగించారు.

నల్లగండ్లలో ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

శేరిలింగంపల్లి: రెయిన్ బో స్కై ఆధ్వర్యంలో నల్లగండ్లలోని శ్రీ ఫిట్‌ప్రో బ్యాడ్మింటన్ హౌస్‌లో 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ 2023 పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ పోటీల్లో బాలికల విభాగంలో సింగిల్స్ విజేతగా లక్ష్మీ రిధిమా నిలవగా, రెండో స్థానంలో అనుసంజన దక్కించుకున్నారు. అండర్ –15 పోటీలు నిర్వహించారు. సింగిల్స్ బాలుర విభాగంలో విజేతగా జాగర్లమూడి యువసూర్య, రెండో స్థానంలో కృష్ణ భార్గవ్ నిలిచారు. అదే విధంగా డబుల్స్ బాలికల విభాగంలో విజేతలుగా లక్ష్మీ రిధిమా, సరయూలు టైటిల్‌ను గెలుచుకున్నారు. రెండో స్థానంలో ఆరాధ్యరెడ్డి, అవనిరెడ్డిలు నిలిచారు. బాలుర డబుల్ విభాగంలో జాగర్లమూడి యువ సూర్య మోహన్ కృష్ణ లు విజేతలుగా నిలవగా, శ్రవణ్ కుమార్, శశాంక్‌లు రెండో స్థానంలో నిలిచారు. డబుల్స్ మిక్స్‌డ్ విభాగంలో మోహన్ కృష్ణ, లక్ష్మీ రిధిమలు విజేతలుగా నిలిచారు. రెయిన్బో స్కై సీఈఓ శ్యాంసుందర్ పోటీల్లో విజేతలకు ప్రైజ్ మనీతో పాటు సర్టిఫికేట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండి రమేష్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లను అందజేసిన రెయిన్ బో స్కై సీఈఓ శ్యాంసుందర్ తదితరులు

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జీవీఆర్‌కేఆచార్యులుకు అరుదైన అవకాశం కలిగింది. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ (ట్రేడడీఎఫ్ఏటీ) ఆస్ట్రేలియా, ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులుకు ఈ అవకాశం కలిగింది, ఆసియా పసిఫిక్ ఏజ్డ్ కేర్ హబ్(ఏపీఏసీహెచ్) ఫెలోషిప్ కింద ఫ్లిండర్స్ యూనివర్శిటీ నిర్వహించే ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియా ఫెలోషిప్ కింద ఆయన పసిఫిక్‌లో వృద్ధుల సంరక్షణ కోసం కెపాసిటీ బిల్డింగ్ నెట్‌వర్క్‌ల ప్రభావం, నాయకత్వం' అనే అంశంపై ఫెలోషిప్ ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది. ఈ ఫెలోషిప్ కింది ప్రొఫెసర్ ఆచార్యులుతోపాటు ఫ్లిండర్స్ యూనివర్శిటీ, అడిలైడ్, కాన్‌బెర్రా, సిడ్నీలను ఆయన సందర్శిస్తారు. ఈ ఫెలోషిప్‌లో ఆరు దేశాల నుంచి 15 మంది సభ్యులు పాల్గొంటారు. భారతదేశం, నేపాల్, బంగ్లాదేశ్, మలేషియా, ఇండోనేషియా ఫిలిప్పీన్స్ ఆరోగ్యవ వ్యవస్థలను బలోపేతం చేయడంలో వారు అత్యుత్తమ ట్రాక్ రికార్డ్ ఆధారంగా సభ్యులుగా నామినేట్ చేయడ్డారు, అలాగే వారి స్వదేశాలలో వృద్ధుల సంరక్షణ వ్యవస్థలను మెరుగుపర్చడంలో వారు ప్రదర్శించిన నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తారు.

శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. చెన్నైకు చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి రాజేశ్వరీ అరవింద్ తన ప్రదర్శనతో అలరించింది. ఇందులో దరువు, గణేశశ్లోకం, అలరిపు, ఆనంద నర్తన ప్రకాశం, బారో కృష్ణయ్య అంశాలను ప్రదర్శించి అలరించారు. కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవికూచిపూడి శిష్యబృందం చే చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. గజవదన బెడువే, గరుడ గమన, నమశ్శివాయతే, విన్నపాలు వినవలె, వినోరో భాగ్యము, నారాయణీయం, ఇతడే పరబ్రహ్మ, తిల్లాన అంశాలను సహస్ర, మధులిక, హంసిని, మిత్రవింద వాసవి, శ్రీలేఖ తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



హఫీజ్‌పేట్ : మాజీ ప్రధానీ, భారత రత్న రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ జమీర్, ఇలియాస్ షరీఫ్, నడిమింటి కృష్ణ, పద్మిని, ప్రియదర్శిని, జమీల్, భరత్ గాంధీ రెడ్డి, వెంకటేష్ గౌడ్, సయ్యద్, శ్రీశైలం, జనార్ధన్, అఫ్రోజ్ ఖాన్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ డివిజన్‌లో..

మియాపూర్: మియాపూర్ డివిజన్‌లో మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ జె రిపాటి జైపాల్ ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెరిపాటి జైపాల్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రసిడెంట్ గోల్కొండ శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ మొహసిన్ పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- వీరన్నగూడలో కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎంపీ బీబీ పాటిల్

జిన్నారం(పటాన్‌చెరు): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ (బొంపతల్లి)లోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయ సమీపంలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో నూతనంగా కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లను ఎంపీ, ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరభద్రస్వామి దేవాలయానికి ఏళ్లుగా ప్రాచుర్యం ఉందన్నారు. దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వీరశైవలింగాయత్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ వీరమల్లేశ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భద్రప్ప పాల్గొన్నారు.



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

పటాన్‌చెరు: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంలా ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భానూర్ గ్రామానికి చెందిన సఫియా ఖతుం కుటుంబ సభ్యులకు రూ. 2.50లక్షల ఎల్ఓసీ చెక్కును అందజేశారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, అఫ్జల్, మెరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.